

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 20 అక్టోబర్, 2023 సంచిక : 5, 6

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**
**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**
**ప్రధాన సంపాదకత్వం :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ప్రత్యేక సహకారం :**
డా॥ జి.చంద్రారెడ్డి M.A, M.Ed., Ph.D
శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)
శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)
**ప్రచార సారథ్యం :**
శ్రీ బి. గోపీకృష్ణ
శ్రీమతి బులుసు జయ

**సాయివాణి చందా వివరాలు**

రెండు సంవత్సరాలకు చందా..రూ॥200/-
10 సం.రాలకు చందా....... రూ॥1000/-

**చిరునామా :-**
**సాయివాణి**
**సాయిధామం, బొమ్మల రామవరం మండలం,**
**యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.**
**Ph : 9440413455, 9848133565**

**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి ........ 2
రిటైర్‌మెంట్? ........ 5
నాన్న గారి మంచితనం ........ 11
శాశ్వత ధర్మగోప్త ........ 18
సాయిభక్త దాసగణు ........ 21
శ్రీ సాయి నిత్య పారాయణ ........ 24
గురువాణి ........ 26
మాతృసంస్థ కబుర్లు ........ 28
శ్రీ దత్త మహాయాగము ........ 31

ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి

ఆ మధ్య ఓసారి ఓ పాట ఆలపించుకున్నాను. "అమ్మా అని నిన్నెలా పిలవగలం? నీ బిడ్డలమేనని ఎలా నిలువగలం? చేవ చచ్చి, చేతకాక బ్రతుకుతున్న అర్ధశవాలం-వ్యర్థజీవులం!" అని. ఛ! నిజంగా ఏం బ్రతుకులు బ్రతుకుతున్నాం! హాయిగా కబుర్లు చెప్పకొంటూ పార్కుల్లో కూర్చున్నవాళ్లను, హోటళ్లలో భోం చేసేవాళ్లను, క్రిక్కిరిసిన దుకాణాల్లో కావలసినవి కొను కొంటున్న వాళ్లను, రైలు ప్రయాణానికి రిజర్వేషన్ సెంటర్లలో నిలబడిన వాళ్లను-ఎందరినైనా సరే బాంబులుపెట్టి చంపి పారెయ్యవచ్చు మన దేశంలో. మనం మాత్రం ప్రశాంతంగా ఉండాలి. అలా అని మన నాయకోత్త ములు సెలవిస్తారు. మనం మౌనంగా తలవంచుకుంటాం. మన ప్రజా హక్కుల పరిరక్షకులకుగానీ, సమాజసేవకులకుగానీ ఒరిస్సాలో స్వామీజీల హత్యలు, అమర్‌నాథ్ యాత్రికుల కోసం స్థలం కేటాయింపుపై అన్యాయాలు ఎన్నో లెక్కలేనన్నిచోట్ల దేవాలయాల విధ్వంసాలు, ప్రతి పదిళ్లకూ ఒకటిగా మైకులుపెట్టి హోరెత్తిస్తున్న 'ఇల్లే ఒక చర్చి' ప్రణాళికలూ-దుండగుల చేతుల్లో నానా అగచాట్లు పడుతున్న సామాన్యులూ-పెద్ద కుటుంబాలని పేరొకటి ఏడ్చింది గనుక తమ ఆడపిల్లలకు ద్వేషంతో, పొగరుతో బలిసిన వెధవలు చేసే అవమానాలను పైకి చెప్పకోలేక, మర్చిపోలేక ఏడ్చేవాళ్లు-వీళ్లెవ్వరూ కనపడరు. ఎన్‌కౌంటర్లన్నీ దొంగవేనని బుజువుచేసే ఆర్భాటమేగానీ-దున్నపోతుల మందలో ఆవుదూడల్లా బిక్కుబిక్కుమంటున్న సామాన్యులను రక్షించాలన్న తపన ఉన్నదా?

వీళ్లకుతోడు దూరదర్శన్ వారి దౌర్భాగ్యపు ఛానళ్లు చేసే వెధవ ప్రదర్శనలు. ఎవడో చస్తానని బెదిరించడానికి కొండెక్కో, పెద్దఎత్తైన

భవనం ఎక్కో కూర్చుంటాడు. కారణం ఏమిటిరా అంటే ఉద్యోగం దొరక లేదు-ప్రేమించిన పోరి పెళ్లికి ఒప్పుకోలేదు-ఇలాంటివి. సైకిక్ కేసులివి. ఇక మన టి.వి.ల వారు వీడి బొమ్మ క్షణానికోసారి చూపిస్తూ, వెర్రి కామెంటరీలు వినిపిస్తూ ఉంటారు. ఎవరో ఓ వెర్రిగాడిద మణికట్టు దగ్గర నరం కోసుకు చచ్చిపోయింది. అదో పెద్ద ఇష్యూ ఓ రెండురోజుల పాటు. అలాంటి తలతిక్కతో ఉన్నవాళ్లు ఇంకొంత మందికి కూడా తలకెక్కేదాకా వీళ్లు వదలరు ఆ దృశ్యాన్ని. వీళ్లకు దేశంలోని అసలైన సమస్యలు పట్టవు. మైక్రో బ్యాంక్ పేరిట అప్పులిచ్చి గ్రామీణుల ధన, మాన ప్రాణాలను గూడా బలి గొంటున్న వారి చేష్టలు తెరకెక్కించే ధైర్యం లేదు. ఎన్‌కౌంటర్లో చచ్చి పోయిన నక్సలైట్ తల్లిదండ్రులెంత ఏడుస్తున్నారో, అక్కచెల్లెళ్లు ఎంత కుమిలి పోతున్నారో పదేపదే చూపించే వీళ్లు-ఆ నక్సలైట్ వలన గతంలో దారుణ హింసలు అనుభవించిన వాళ్లను ఇంటర్వ్యూ చెయ్యరు. వాళ్ల మనోభావాలు చెప్పరు. చంపిన కృష్ణుడికన్నా, వాడి జైళ్లలో మగ్గుతున్న పదహారు వేల రాచకన్నెలకన్నా-చచ్చిన నరకాసురుడినీ, వాడి కుటుంబ సభ్యుల దుఃఖ్ఖాన్ని ఎక్స్‌పోజ్ చేసి ప్రదర్శించే బుద్ధి వీళ్లది.

ఇక-మన నాయకులు-వీళ్లను అలా అనుకోవడానికి కూడా మనం సిగ్గుపడాలి. పక్కవాడి పండగొస్తే వీళ్ల నెత్తిన వాళ్ల టోపీలు-వీళ్ల చేతుల్లో వాళ్ల ప్రసాదాలు. అవతలి వాళ్లెవరైనా-ఎప్పడైనా-కనీసం ఒక్కసారైనా ఈ జాతి పండుగల్లో భాగస్వామ్యం వహిస్తున్నారా? లేకపోగా మన సామూహికోత్సవాలలో బాంబులు విసరకుండా ఉంటే అదే పదివేలని వణికి చస్తున్నాం. మరి ఎందుకీ ఆత్మవంచన? ఇరువైపులవారూ ఒకరికొకరు ఎదురువచ్చి కౌగిలించుకొంటే అది ఆప్తత. ఈ ఏకపక్ష ఆప్తతను చేవలేనితనం, పిరికితనం అంటే తప్పా? పోనీ-'మన జాతికి ఈ కలుపుగోలుతనం, అందరినీ కలుపుకుపోవటం ధర్మమండీ! అంటారా-ఎన్నేళ్లు, ఎన్నాళ్లు? ఓ ప్రక్క జరుగుతున్న ఘోరాలన్నీ కళ్లారా చూస్తూ-అనుభవిస్తూ-అమాయకంగా బలి అయిపోతున్న అశేషప్రాణి లోకపు ఉసురుపోసుకొంటూ ఉంటారా, దీన్ని అరికడతారా? అంతచేతగాని వాళ్లను ఎన్నుకొన్న సిగ్గుమాలిన వాళ్లం మనం కాదూ! ఈ ఉసురులో సగభాగం మనది కాదూ!





పోనీ-మన వార్తాపత్రికల్లో కలేజా ఉన్నవెన్ని? ఏదైనా ఓ పత్రిక కాస్త ధైర్యం చూపిస్తే దానిమీద ఏలినవారి క్రోధాగ్ని వర్షం కురుస్తుంది. స్వచ్ఛంద సంస్థలేమైనా కల్పించుకోగల్గుతున్నాయా? మన ధర్మాన్ని పతనం చేస్తున్న ఎవరో విదేశీయుడిని చంపితే కన్నీటి వర్షం కురిపించే మన వారికి-సాధు సత్పురుషులను అరెస్టు చేసి అవమానాల పాలు చేసినా, చంపి పారేసినా నోరు పెగలదు. మళ్లీ అందులో శైవం, వైష్ణవం తేడాల ఏడుపొకటి. ఎవరైనా అలా సాహసించి మాట్లాడినా, ఏదైనా ప్రతిక్రియ చేయబోయినా-వాళ్లు కాస్తా మత సంస్థలై పోతున్నారు, మతవాదులైపోతున్నారు. మళ్లీ మాట్లాడితే నిషేధించవలసినంత పాపులైపోతున్నారు.

అయ్యో, ఇక మన యువలోకం దగ్గరికి వస్తే-కడుపుచించుకుంటే కాళ్ల మీద పడుతుందన్న తంతుగా ఉంది. ఆంగ్లేయుల క్రింద పనిచేయవలసి వస్తుందన్న కారణంగా-కావాలని ఐ.ఏ.ఎస్. పరీక్షలు వదిలేసుకొని స్వరాజ్యోద్యమంలో దూకిన వారికి వారసులు వీరు. సముద్రాలు ఈది వెళ్లి మరీ సైన్యస్థాపన చేసిన మహనీయులకు మునిమనుమలు వీరు. 'ఏమైనా చేసుకో-నేను మాత్రం నీకు లొంగను. నేను స్వేచ్ఛా పిపాసిని' అన్న ఆ తరానికి నేటి గుర్తులు వీరు. ప్రస్తుతం 'హాయ్ హేండ్‌సమ్'లాటి ఆడంగివేషాలకో, పనికిమాలిన ప్రేమాయణాలకో, లేక విదేశీ సంపద పెంచేందుకై ఆ దేశాలకే తమ శక్తియుక్తులన్నీ ధారపోసే బానిసబుద్ధికో అంకితమైపోయి "పుట్టుకతో వృద్ధులా" అనిపిస్తున్నారు. ఇంతటి స్వార్థం, ఇంత నైచ్యం ఏ శతాబ్దంలోనైనా ఏ దేశంలోనైనా పెచ్చు పెరిగాయా? అలా చూస్తూ కూర్చున్న మనకన్నా వెర్రివెధవలు ఎవరుంటారు? మనకన్నా అర్థశవాలూ, వ్యర్థజీవులూ ఎక్కడుంటాయి!

స్వయంగా సత్యాగ్రహాన్ని కనుగొన్న బాపూజీయే "అన్యాయంగా కయ్యానికి కాలు దువ్వేవాళ్లను సహించవలసిన అవసరం లేదు. ధర్మాన్ని రక్షించుకోవటం కోసం అధర్మపరులపై యుద్ధం చేస్తే తప్పులేద"ని ప్రోత్సహించిన సందర్భంఒకటి ఉంది మన చరిత్రలో స్వరాజ్యం వచ్చిన తొలినాళ్ల లోనే. అంతకన్నాముందే-అహింసా సిద్ధాంతం తలకెక్కి వెనుకడుగువేస్తున్న సేనాపతులను పిలిచి, "మీ మీదికి దండెత్తివచ్చిన వాడు ఏం చేస్తాడు? నీ దేశసంపద కొల్లగొడతాడు. నీ దేశపు స్త్రీలను అవమానిస్తాడు. యువతను బంధిస్తాడు. ఈ అరాచకం జరగకుండా ఉండటానికి అమాయకులపై వాళ్లు చేసే దారుణహింసను ఆపటం కోసం-నీవు వాళ్లను పొలిమేరల్లోనే ప్రతిఘటించు" అని గౌతమబుద్ధుడే స్వయంగా బోధించిన సందర్భం కూడా మన చరిత్రలోనిదే. అంచేత మిత్రులారా, ఉత్తిష్ఠ-జాగ్రత్త-ప్రాప్యవగాన్ని బోధత.

## రిటైర్‌మెంట్?

**- శ్రీ మాతా శుకవాణి**

ఆ మధ్య నా చేతికొక పాంప్లెట్ వచ్చింది. ఏదో ఒక సంస్థ వారు రిటైర్ కాబోతున్న వృద్ధులనుద్దేశించి వేసిన కరపత్రం అది. మూడు విభాగాలుగా ఉంది అందులో విషయం. మొదటిది మీరిక రిటైర్ కాబోతున్నారు. కనుక మీ కుటుంబసభ్యులతో ఉండే డీలింగ్స్‌లో, వారితో మీ ప్రవర్తనలో కొంత మార్పు తెచ్చుకోవలసి ఉంటుంది. ముందటిలాగా వాళ్లంతా మీకు అగ్గగ్గలాడుతూ సేవ చేస్తారని ఆశించకూడదు. మీరు ఖాళీగానే ఉంటారు గనుక మీరే కాస్త ఓర్పుగా, ఒద్దికతో ఉంటే పేచీలుండవు. రెండవది-ఇకపై మీకు పెద్దగా ఆర్జన ఉండదు గనుక యీ చివరిలో వచ్చే డబ్బును జాగ్రత్తగా నిలవచేసి, లేదా మా ఫలానా పథకంలో పొదుపు చేసి మీ కడపటికాలంలో అక్కరకు వచ్చేటట్లు చేసుకోండి. ఇక మూడవది-సమయాన్ని ఆధ్యాత్మిక కాలక్షేపాలలోగానీ, సాహిత్య పఠనంలోగానీ, ప్రశాంతంగా వెళ్లబుచ్చుకోండి. ఇవీ సలహాలు.





ఇవన్నీ బాగానే ఉన్నాయి. వృద్ధాప్యంలో ఒద్దిక, ఆర్థికమైన ఆసరా, ఆధ్యాత్మిక చింతన అవసరమే మరి-మిగిలిన వారెవరికీ అక్కరలేదా? వారంతా పేచీలుపడుతూ, దుబారా చేస్తూ, దేవుడన్న ముక్కే అనకుండా బ్రతకవచ్చా? అంటే వారికీ కావాలిగానీ, వృద్ధులకు మరింత అవసరం అనుకోవచ్చు. అంతవరకు బాగానే ఉంది.

ఐతే యిక్కడో మెలిక ఉంది. అసలు రిటైర్‌మెంట్ అంటే ఎందులో నుంచీ రిటైర్‌మెంటు? కేవలం తాము చేస్తున్న వృత్తి లేదా ఉద్యోగం లోంచి మాత్రమే గదా! అప్పటికి వయస్సెంత? 58 లేదా 60 సంవత్సరాలు. నేటి సగటు మనిషి జీవితంలో మొదటి రెండు రెండున్నర దశాబ్దాల కాలం విద్యాభ్యాసంలోనూ, ఉద్యోగ ప్రయత్నంలోనూ కరిగిపోతాయి. వివాహం, సంతానం, ప్రమోషన్లు, ఇతరులతో పోటీల, పిల్లల చదువులు, పెళ్లిళ్లు-ఒకటే హడావుడి-పరుగు పందెం అలా చూస్తూ చూస్తూ సర్వీసులో చివరి సంవత్సరం రానే వస్తుంది. ఇక అప్పుడు మొదలుపెడతాం ఆలోచన. ఒక శిశువు జన్మించగానే వాడి పేరు ఆలోచిస్తాం. రెండేళ్లో, మూడేళ్లో రాగానే వాడికి ఏం చదువు చెప్పించాలో ఎంత స్థాయికి తీసుకుపోవాలో ఆలోచిస్తాం. అమ్మాయికి పెళ్లి చెయ్యాలి గనుక ఆమెకు నాలుగైదేళ్లు వచ్చినప్పటినుంచి పొదుపు చేసి డబ్బు కూడబెడుతుంటాం. చివరకు మన తరువాత పిల్లలు ఎలా బ్రతకాలో కూడా ప్లాన్ చేసి ఉంచుతాం. ఇలా మన తనువు ద్వారా ఏర్పడిన బంధువుల గురించి ఆలోచించు మనం-సరిగ్గా మన గురించి మాత్రం మర్చిపోతాం. ఒకవేళ గుర్తున్నా-సవ్యమైన రీతిలో ప్లానింగ్ జరగదు. అలా అని ఎందుకనుకుంటున్నామంటారా!

ముందే అనుకున్నాం-విద్యావంతులం కావటానికి రెండు దశాబ్దాలకు

పైగా కృషి చేసామని, ఆ విద్యా జ్ఞానానికి తోడు మూడు దశాబ్దాలకు పైగా ఉద్యోగ జీవితంలో ఆర్జించుకున్న లోకజ్ఞానం, తెలివితేటలు, సామర్థ్యాలు-ఇవన్నీ కలసి అరవై ఏళ్ల పరిణతిని కలిగిస్తాయి. సరిగ్గా అప్పుడు రిటైరవుతాం. అప్పటికి కుటుంబ బాధ్యతలు చాలావరకూ తీరిపోతాయి. నిన్నటిదాకా ఉన్న ఉరుకులు పరుగులు, గందరగోళం, తీరికలేనితనం, మానసికమైన ఒత్తిళ్లు గణనీయంగా తగ్గిపోతాయి. ఒకప్రక్క మానసిక పరిణతి కలిగే అవకాశం, మరోవైపు ప్రశాంతత చిక్కే అవకాశం-యీ రెండు కలిస్తే ఎన్ని మహత్కార్యాలు చెయ్యవచ్చు. కానీ, మనం మాత్రం "ఇక నా పని అయిపోయింది. ఏదో యీ నాలుగు రూపాయలు దాచుకొని, కృష్ణా, రామా అనుకొని కాలక్షేపం చెయ్యాలిక" అనుకుంటున్నాం. ఇదెంతవరకు సబబు?

మాతృఋణం, పితృఋణం, సమాజ ఋణం, గురు ఋణం, ఇవి ప్రతి మనిషినీ వెన్నంటి ఉండే ఋణాలని ధర్మశాస్త్రం చెప్తుంది. మాతృ ఋణం, పితృ ఋణం తీరడానికి వారిని వృద్ధాప్యంలో సేవించుకోవటం, మన పిల్లలకు వారి ఇంటిపేరు ఇవ్వటం, ఇక అపర కర్మల వంటివి చెయ్యటం వంటి మార్గాలున్నాయి. చేస్తాము. గురు ఋణం తీరడానికి ఒకే ఒక మార్గం గురుబోధ ప్రకారం నడుచుకోవటం, ఆ బోధలను ఇతరులకు చెప్పటం. ఇవన్నీ తీరిపోతున్నాయి. మరి సమాజ ఋణం మాటేమిటి? అదెలా తీరుతుంది? అసలు సమాజానికి మనం ఎందుకు ఋణపడ్డాం? చిన్ననాడు తెలిసీ తెలియక వీధి మధ్యలో నడుస్తోంటే వెనుక నుంచీ ఒక కారో, లారీయో వచ్చి మీద పడబోతుంది. ఎవరో ఒక పెద్ద మనిషి చెయ్యి పట్టుకొని లాగాడు. ఆయన మనకు ప్రాణదాతే గదా! చెడ్డ మాటలు మాట్లాడుతుంటే తప్పని చెప్పి కోప్పడి నచ్చచెప్పాడొకాయన. ఆయన జ్ఞానదాతే గదా! సమాజంలో ఎందరెందరి స్నేహం, సహకారం,



సాయి వాణి

ప్రేమ, అభిమానం, గౌరవం ఆదరం ఉంటే యింతకాలం గడిచింది మనకు! మరి యీ సమాజ ఋణం ఎలా తీరాలి? మనకు సాయపడిన వారందరినీ వెదకి పట్టుకోలేం గదా! అంచేత అవసరంలో ఉన్న మరెవరికో చేయూతనిస్తే ఆ ఋణం తీరుతుంది. లేకుంటే అది "ఈగగ మారి అప్పై" మనం వెంట జన్మజన్మలకూ తిరుగుతూ ఉంటుంది.

మనం మానవజన్మ ఎత్తినందుకు, ఇంత పేదదేశం ఎంతో పెట్టుబడి పెట్టి మనను చదివించినందుకు, నిలువనీడనిచ్చి, నీరిచ్చి, పంటలిచ్చి పెంచి పోషించినందుకు-మనం యీ నేలతల్లికి ఏం చేసాం? ఈ దేశంలోని దీనదుఃఖితులకు, "అమ్మా" అని నోచుకోని అనాథ శిశువులకు, గుప్పెడన్నం పెట్టి, ఒక చల్లని మాటతో ఆదరించేవారు లేని అనాథ వృద్ధులు, కుటుంబాలు విచ్ఛిన్నమై దిక్కు లేకుండా పోయే స్త్రీలు, ధర్మం ఏమిటో మన దేశ గత వైభవం ఎట్టిదో, నేటి దుస్థితికి కారణం ఏమిటో- తిరిగి ఆ కాలపు సొగసు పొందడానికి ఏమి చేయాలో-ఏమీ తెలియని నిరక్షరాస్యులు, చీకటి నెత్తినేసుకొనిపోయి, తిరిగి గంపెడు చీకటి నెత్తికెత్తుకొని రావడం తప్ప పగటి వెలుగులో తమ భార్యాబిడ్డల ముఖాలైన చూడ నోచుకోని కష్టజీవులు-"వీళ్లందరూ మీవైపే ఆశగా చూస్తున్నారు. మీరు ఒక వలయం నుంచి విముక్తులయ్యారు. మాకీ ఇక్కట్లనుంచీ, యీ అజ్ఞానం నుంచీ విముక్తి కలిగించే ప్రయత్నం చెయ్యరూ!" అని అడుగుతున్నారు.

ఇరుగుపొరుగుల్లో ఉన్న పిల్లలను పోగుచేసి, ఏ ఆదివారం ప్రొద్దున్నో, శనివారం సాయంత్రమో వారానికొక్కరోజు-అదీ ఒక్క రెండు గంటలసేపు ఓ మంచి పద్యం, లేదా శ్లోకం-నీతి బోధకమో, దేశభక్తి ప్రబోధకమో అయినది నేర్పటం, చరిత్రలోంచీ చక్కని సంఘటన ఒకటి చెప్పటం చెయ్యగలం, రకరకాల రంగాల్లో పైకి వచ్చిన వారి గాథలు చెప్పవచ్చు.

ఆయా ప్రాంతాలలో సైన్స్ గురించి ప్రాథమిక జ్ఞానం (ఆహారం వంటి విషయాలలో) పరిశుభ్రత, చిన్న చిన్న సమావేశాల ద్వారా పెద్దలలో కూడా కలిగించవచ్చు. మన సంస్కృతి, సాహసగాథలు, పరోపకారం మొదలైన విలువలను గూర్చి చెప్పటం-మొత్తం మీద నేటి స్కూలు విద్య యివ్వలేక పోతున్న అంశాలు పూర్తి చేయటం లాగా అనుకుందాం. ఆ పని చెయ్యవచ్చు. పగటివేళలలో మురికివాడలలోని పిల్లలకు నాన్‌ఫార్మల్ ఎడ్యుకేషన్ (అనియత విద్య) ఇవ్వవచ్చు. మన ఇతిహాసాలలోని గొప్ప విషయాలు చెప్పవచ్చు.

చేరువలో ఉన్న ఆశ్రమాలలోని కార్యకలాపాలలో పాలు పంచుకోవచ్చు. అనాథాశ్రమాలలో, వృద్ధాశ్రమాలలో సత్సంగ కార్యక్రమాలు ఏర్పాటు చేయవచ్చు. "మా గురించి కూడా ఆలోచించే వారున్నారు" అన్న భావన కలుగజేస్తూ వాళ్ల దగ్గర ఓ గంటసేపు కూర్చొని మంచిచెడులు విచారించవచ్చు. ఆసుపత్రులలో వరండా పెషేంట్లు, నేల పెషేంట్లు (నిరాదరణకులోనై అలా పారవెయ్యబడ్డ వాళ్లు) ఉంటారు కొందరు. వారి విషయం ఏం చెయ్యగలమో చూడవచ్చు.

అంతదూరం కూడా అక్కరలేదు. మన ఇరుగుపొరుగులలో వ్యాధిగ్రస్తులై ఉన్నవారు బాగా వయోవృద్ధులై మూలబడి ఉన్నవారూ ఉన్నారు. వీరిని కూడా దృష్టిలో ఉంచుకొని సేవ చేయవచ్చు. కాస్త ఆధ్యాత్మిక బోధ-కొంత సద్విచారం-రవంత ఆప్యాయత కలిపితే అద్భుతమైన ఫలితాలు వస్తాయి.

ఇంతేకాదు-మనకున్న విద్య, ఉద్యోగానుభవాలను పురస్కరించుకొని, పరిసరాలలోని హైస్కూళ్లు, కాలేజీలలోని విద్యార్థులకు మానవజీవిత విలువలు తెలిసేలాగా కొన్ని యథార్థగాథలు, కొన్ని చర్చలు ద్వారా ప్రయత్నించవచ్చు. కెరీర్ గైడెన్స్ ఇవ్వవచ్చు. అలాగే మనం ఏ రంగంలోనైనా నిష్ణాతులమైతే ఆ రంగంలోని లోతులు, మెలకువలను గూర్చి ఆయా విద్యాలయాలలోని ఉపాధ్యాయులకు కూడా బోధించవచ్చు. వారి ద్వారా అవి ఎన్నో ఏళ్లపాటు విద్యార్థులకు అందే అవకాశం ఉంది. వెనుకబడిన ప్రాంతాలలోని పాఠశాలల్లోని పిల్లలకు ఎంతో ఆర్థికంగా, బోధనలో ఆటపాటల్లో కూడా సాయపడాలి.





వరదలు, తుఫానుల వంటి ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు తమ బంధుమిత్రులందరి ద్వారా చేతనైనంత ధనమో, వస్తువులో సేకరించి ఏదో ఒక మంచి సేవాసంస్థకు అందించటం చెయ్యవచ్చు. శారీరకంగా, ఆరోగ్యంగా ఉంటే డైరెక్టుగా సేవ చెయ్యటానికి వెళ్లనూవచ్చు. విద్యావ్యవస్థలోని అవకతవకలన్నీ (పాఠ్యాంశాలు చదివి) విద్యాధికారులకు, పత్రికలకు పేరెంట్స్ కమిటీలకు వ్రాసి చైతన్యవంతులను చేయవచ్చు కూడా టి.వి.లలో, సినిమాలలో వచ్చే ఛండాలపు దృశ్యాలను గూర్చి వివరిస్తూ-టి.వి. అధికారులకు, చిత్రసీమ డైరెక్టర్లకు, పత్రికలకు లేఖలు వ్రాయవచ్చు.

ఇలా ఆలోచిస్తూ, వెదుక్కొంటూ వెడితే మనకు చేయదగిన, చేయవలసిన పనులు ఎన్నెన్నో-వందల సంఖ్యలో దొరుకుతాయి. ఒక ఆంగ్లకవి అన్నట్లు మనిషికి అసలైన జీవితం రిటైర్‌మెంటు తరువాతనే మొదలవుతుంది. మన చుట్టూ ఉన్న వారితో విస్తృత పరిచయాలు ఏర్పరచుకోగల అవకాశాలు, తీరిక కలిగేదిప్పడే.

మన పెద్దలు చెప్తుంటారు "చివరి క్షణాన మనం ఎంత ధనం వదిలి వెళ్తాం అన్నది కాదు ముఖ్యమైన విషయం. మన ప్రేమను ఎందరి హృదయాల మీద ముద్రవేసి వెళ్లగలుగుతున్నాం అన్నదే ముఖ్యం" అని. ఆ విధంగా - మనం కడపటి శ్వాస పీల్చాక, మన కోసం కన్నీరు పెట్టుకునే వారిలో మన బంధుమిత్రులు కాక- యీ విధంగా మన ద్వారా మేలు పొందిన వారెందరుంటారు? అన్నది దృష్టిలో ఉంచుకొని ఆ మేరకు మన జీవితాన్ని ధన్యం చేసుకొనే ప్రయత్నం చేద్దాం.

# నాన్నగారి మంచితనం

**- వాట్సప్ సేకరణ**

**(గత సంచిక తరువాయి)**

'ఆ కాలంలో టీవీలూ, ఫ్రిజ్జులూ లేవు. సంపాదించిన డబ్బు కుటుంబం కోసం, పిల్లల చదువుల కోసం ఖర్చుపెట్టేవారు. దుబారా ఖర్చులు చేసేవారు కారు.

రాబడి, ఖర్చు దాదాపు సమానం కావడంతో పెద్దగా అప్పులు చేసే అవసరం ఉండేది కాదు.

తృప్తిగా మనశ్శాంతితో బతికేవారు. కానీ ఈనాటి పరిస్థితి వేరు. పెళ్లైన వెంటనే టీవీ, ఫ్రిజ్, ఏసీ, కంప్యూటర్, కారు అన్నీ కొనేయాలి. వీటిలో చాలా వస్తువులు స్టేటస్ సింబల్‌గా మారిపోయాయి. అవసరాలకూ, విలాసాలకూ తేడా తెలుసుకోలేకపోతున్నారు. ఇంటికి నిదానంగా ఒక్కొక్కటే అమర్చు కుందామన్న ఆలోచన, ఓపిక లేదు. పైగా ఫ్లాట్ల రేట్లు పెరుగుతున్నాయనీ, ఇన్‌కంటాక్స్ తగ్గుతుందనీ చేతిలో డబ్బులు లేకపోయినా ఇళ్లు కూడా కొనేస్తున్నారు.

కంపెనీలూ, బ్యాంకులూ లోన్లు ధారాళంగా ఇస్తూండటంతో అన్ని లోన్లూ తీసుకోవడం, జీతంలో ఇన్‌స్టాల్‌మెంట్లకు పోగా మిగిలింది చాలక పోవడం, దీంతో ఇబ్బందులు, విసుగు, అసహనం మొదలు. వీటన్నిటితో పాటు ఉద్యోగంలో ఒత్తిడులు, అభద్రతాభావం పెరుగుతున్నాయి.

ఇన్ని ఒత్తిడుల మధ్య పాపం తల్లి ప్రేమ, ఆమె సేవలు వీళ్లకు గుర్తు రావడం లేదు.

ఉన్నంతలో తృప్తిగా బతకడం వీళ్లకు ఎప్పుడు అలవాటవుతుందో అనుకుని బాధగా నిట్టూర్చింది.

✡ ✡ ✡





వారం రోజులు గడిచిపోయాయి.

సావిత్రికి పిల్లల నుంచి ఫోన్‌కాల్స్ లేవు. ఫోన్ మోగితే 'పిల్లల నుంచేమో' అని ఆశగా ఫోను దగ్గరకి పరిగెడుతుంది.

ఓ రోజు తన ఇంట్లోకి అడుగుపెట్టిన కొత్త వ్యక్తిని ఆశ్చర్యంగా చూసింది సావిత్రి. "నా పేరు శ్రావణ్. బ్యాంకులో ఫీల్డ్‌ఆఫీసర్ని" అంటూ తన వివరాలు చెప్పాడతను.

"రండి, కూర్చోండి" అంటూ కుర్చీ చూపించింది.

"రామనాథంగారు నేను క్లర్క్‌గా ఉన్నప్పటినుంచీ నాకు తెలుసు. ఆయన ఇల్లు కట్టడం కోసం, పిల్లల చదువుల కోసం, వాళ్ల పెళ్లిళ్ల కోసం, ఎన్నోసార్లు లోన్లు తీసుకున్నారు. అయితే ఆయన ఇన్‌స్టాల్‌మెంట్ కట్టక పోవడం అన్నది ఇంతవరకూ జరగలేదు. మొదటిసారిగా ఆయన మోర్టగేజ్ లోన్ ఇన్‌స్టాల్‌మెంట్ బాకీపడింది. నాకు అనుమానమొచ్చి విచారిస్తే ఆయన చనిపోయారని తెలిసింది. మా బ్యాంకు క్రమశిక్షణ కలిగిన ఓ కస్టమర్‌ను కోల్పోయింది" అన్నాడు బాధగా.

"నాకు ఫ్యామిలీ పెన్షన్ మొన్న శాంక్షన్ అయింది. ఈ నెల పెన్షన్ తీసుకోగానే బ్యాంకుకు వచ్చి కట్టేస్తాను" అంది సావిత్రి నొచ్చుకుంటూ.

"అవసరం లేదమ్మా, ఆయన ఇంటిపై తీసుకున్న లోనుపై దాదాపు ఏడు లక్షలు బాకీ ఉంది. అయితే చాలా ఏళ్ల కిందటే మా బ్యాంకు ప్రవేశ పెట్టిన ఇన్సూరెన్స్ స్కీములో మీ వారి లోను కూడా కవరయ్యేందుకు ఆయనచేత సంతకాలు పెట్టించుకుని ప్రీమియం కట్టించుకున్నాం. రామనాథం గారు మరణించారు కనుక ఆ రుణం మొత్తం ఇన్సూరెన్స్ కంపెనీ చెల్లిస్తుంది. మీరు నయాపైసా కూడా కట్టక్కరలేదు. నేను అప్లికేషన్ మీకు పంపిస్తాను సంతకాలు చేసి పంపండి. ఉంటానండీ" అతను నమస్కారం చేసి వెళ్లిపోయాడు.

సావిత్రి భర్త ఫొటో వైపు చూసింది. రామనాథం నవ్వుతున్నట్లు

కనిపించింది ఆమెకు.

✡ ✡ ✡

సావిత్రి కొడుకులకు ఫోన్‌చేసి రుణమాఫీ అయిన విషయం చెప్పి 'ఇల్లు అమ్మకానికి పెట్టాననీ, ఎవరైనా వస్తే కబురు చేస్తాననీ వచ్చి మాట్లాడుకొమ్మనీ' చెప్పింది.

కొడుకులు ఆమె ఊహించిన దానికంటే ఎక్కువగానే సంతోషించారు.

ఆరోజు సాయంత్రం ఊళ్ళో ఉన్న వృద్ధాశ్రమానికి వెళ్ళి ఆశ్రమం మేనేజరుతో మాట్లాడింది. త్వరలోనే తను ఆశ్రమంలో చేరతానని చెప్పింది.

సావిత్రి వివరాలు తెలుసుకున్న మేనేజరు "రామనాథంగారు చనిపోయారా? నాకా విషయమే తెలియలేదే" అంటూ విచారం వెలిబుచ్చారు.

"ఆయన మీకు తెలుసా?" ఆశ్చర్యంగా అడిగింది సావిత్రి.

"తెలియకపోవడం ఏమిటమ్మా? ఈ ఆశ్రమం స్థలం కోసం గవర్నమెంటుకు అర్జీ పెట్టినప్పుడు కలెక్టరాఫీసులో ఆ సీట్లో ఉన్న మీ వారిని కలిశాను. ఆయన సానుకూలంగా స్పందించారు. మంచి కార్యం తలపెట్టినందుకు మమ్మల్నెంతో అభినందించారు. కలెక్టరుగారికి చెప్పి ఈ స్థలం మాకిప్పించారు. డిపార్టుమెంటులో ఆయనకున్న మంచిపేరు వల్ల కలెక్టరుగారు వెంటనే ఒప్పకున్నారు. ఇంతచేసిన ఆయన మానుంచి ఒక్కపైసా కూడా ఆశించలేదు. అటువంటి వ్యక్తి భార్య అయిన మీరు ఓ అనాథలా మా ఆశ్రమంలో చేరడం నాకు బాధగా ఉంది. మీకు అభ్యంతరం లేకపోతే మిమ్మల్ని మా ఇంటికి తీసుకెళతాను. మాతోపాటు ఉండిపోండి. మిమ్మల్ని మా అమ్మలా చూసుకుంటాను".

సావిత్రికి కళ్ళలో నీళ్లు తిరిగాయి. 'భర్త మంచితనం గురించి తెలుసుగానీ అది ఇంతమంది మనసుల్ని గెలుస్తుందని తను ఊహించలేదు' అనుకుంది. 'మరణించి కూడా బతికి ఉండటం' అంటే ఏమిటో ఆమెకు





అర్థమైంది. "వద్దండీ నా వల్ల ఎవరికీ ఇబ్బంది ఉండకూడదనే పిల్లల్ని కూడా కాదనుకుని ఇక్కడికి వస్తున్నాను. పైగా ఇక్కడ ఉంటే నాకు కాలక్షేపం కూడా అవుతుంది. మీరు ఆ మాట అన్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. మీరు పిల్లాపాపలతో కలకాలం చల్లగా ఉండాలి. నేను ఇల్లు అమ్మకం పనులు పూర్తయ్యాక వస్తాను' అంటూ అతని దగ్గర సెలవు తీసుకుంది.

✡ ✡ ✡

ఒకరిద్దరు సావిత్రికి ఫోన్ చేసి ఇల్లు కొనడానికి తమ ఆసక్తిని వెలిబుచ్చారు. ఓ ఆదివారం కొడుకుల్ని రమ్మంటాననీ ఆ రోజు వచ్చి మాట్లాడమనీ వాళ్ళతో చెప్పింది సావిత్రి.

మరుసటి ఆదివారమే కొడుకులు భార్యలతో వచ్చారు. ఆ ఆదివారం ఉదయం ఇంటి గురించి మాట్లాడటానికి వచ్చిన వ్యక్తిని చూసి "మీరు మా ఎదురింటి మేడపైన ఉండేవారు కదా?" అని అడిగాడు వినోద్.

అతను 'అవును నా పేరు రామారావు" అంటూ తన వివరాలు చెప్పసాగాడు. తర్వాత "మేము చాలా ఏళ్ళు ఆ ఇంట్లోనే ఉన్నాం. ఏడాది క్రితమే ఇల్లు చాలక వేరే ఇంట్లోకి మారాం. మీ ఇంటి మండువా మా గది కిటికీ నుంచి బాగా కనబడేది. మీ కుటుంబం మమతానురాగాలకూ, తీపి అనుభవాలకూ ప్రతీకలా అనిపించేది నాకు. ఉదయాన్నే మీ అమ్మగారు ఇంటిముందు ముగ్గులేస్తుంటే మీ తండ్రీకొడుకులూ కబుర్లు చెబుతూ కంపెనీ ఇవ్వడం, భోగి పండుగ రోజు ప్రాతఃకాలాన మీరు భోగి మంటలేస్తుంటే మీ అమ్మగారు కాఫీ తెస్తే, అందరూ కలసి తాగడం, దీపావళిరోజు మీ నాన్నగారు మీతో టపాకాయలు జాగ్రత్తగా కాల్పించడం, ఉదయం నాలుగు గంటలకు లేచి మీరు చదువుకుంటుంటే, మీకు తోడుగా మీ నాన్నగారు కూర్చోవడం, మీ ఇంటికి తరచుగా బంధుమిత్రులు రావడం, రాత్రిపూట అందరూ మండువాలో కూర్చొని పాటలు పాడటం

మాకు కనిపించేది.

ఓసారి విజయ్‌కి ఆటల్లో చేయి విరిగితే ప్రమోషన్ పరీక్ష రాయడానికి వెళ్లిన మీ నాన్నగారు పరీక్ష రాయకుండానే తిరిగొచ్చి పుత్తూరు తీసుకెళ్ళి కట్టు కట్టించడం, నొప్పి తెలియకుండా రాత్రంతా కథలు చెబుతూ జాగారం చెయ్యడం, తన తల్లి వేసుకోవాల్సిన మాత్రల్ని ఏ పూటకాపూట గుర్తుగా ఆమెకివ్వడం, ఆవిడ మంచానపడితే సేవలు చేయడం నా మనసును కదిలించేది.

ఆయన చేసిన ఉద్యోగానికి కావాలనుకుంటే ఈ ఊళ్ళో పది ఇళ్ళు కట్టించి ఉండేవారు. కానీ ఆయన తీరే వేరు. 'పై సంపాదన ఆశించని వ్యక్తి' ని ఊళ్ళో మంచిపేరు తెచ్చుకున్నారు. కళ్ళముందు నోట్ల కట్టలు కనబడుతున్నా, అవసరాలు ఇబ్బందిపెడుతున్నా చలించక నీతికి కట్టుబడి వాటికి దూరంగా ఉండటం చాలా గొప్ప విషయం.

ఇక మా ఇంట్లో ఎప్పుడూ గొడవలే, మా నాన్న గెజిటెడ్ ఆఫీసరు. లంచాలు బాగా తినేవాడు. ప్రతిరోజు తాగొచ్చి ఇంట్లో గొడవలు చేసేవాడు. మాకు చదువు తలకెక్కేది కాదు, ఆయన చనిపోతే ఆ ఆఫీసులో నాకు ఉద్యోగం ఇచ్చారు. ఇప్పుడు నా తమ్ముళ్ళతో నాకు మనస్పర్థలు పెరుగుతున్నాయి. నాన్న ఉద్యోగం నాకొచ్చింది కాబట్టి పెద్దవాడిగా అన్ని బాధ్యతలు తీసుకోమంటారు బంధువులు. అలా తీసుకోవడం నాకు సంతోషమే కానీ ఈ విషయంలో నాకూ, నా భార్యకూ మధ్య గొడవలు అవుతున్నాయి. మనిషికి డబ్బు పుష్కలంగా లేకపోయినా, ఉన్నంతలో జీవితాన్ని ఎంత ఆనందంగా అనుభవించవచ్చో మీ నాన్నగారిని చూశాక నాకు తెలిసింది.

అందుకే మీ ఇల్లు కొని మా తమ్ముళ్ళను, మా అమ్మను ఇందులో చేర్చితే ఆ అదృష్టం మాకూ తగిలి మా సమస్యలు తగ్గుతాయని మా ఆశ.

చదువుకునే రోజుల్నించీ ఈ ఇల్లు నా 'డ్రీమ్ హౌస్'. 'ఇటువంటి మనుషుల మధ్య నేనే లేనే' అని బాధపడేవాణ్ణి.





కనీసం ఈ ఇంట్లో నివసించే అవకాశం వస్తే అది నా అదృష్టంగా భావిస్తాను. ఆస్తుల కంటే రక్తసంబంధాలు, ఆప్యాయతలు, మమకారాలే ముఖ్యమని నమ్మే వ్యక్తిని నేను. మా నాన్నగారి రుణం కొంతలో కొంత నెరవేర్చానన్న తృప్తి నాకు మిగులుతుంది' అన్నాడు రామారావు.

✡ ✡ ✡

రామారావు వెళ్ళిపోయాక విజయ్, వినోద్‌లు మౌనంగా కూర్చొండిపోయారు.

రామారావు చెప్పిన విషయాలే పదేపదే గుర్తుకు రాసాగాయి.

తమ గుండెలో ఎంతో అపురూపంగా దాచుకోవలసిన జ్ఞాపకాల్ని పరాయి వ్యక్తి వచ్చి చెపితే తప్ప గుర్తు చేసుకోలేకపోయినందుకు సిగ్గు పడ్డారు. వాళ్ళ మనసులో తప్పు చేసిన భావన కలిగింది. పశ్చాత్తాపం మొదలైంది.

రాత్రి భోజనాల సమయంలో సావిత్రి - కొడుకు, కోడళ్ళతో వాళ్ళు ఊరు వదిలివెళ్ళాక జరిగిన విషయాలన్నీ చెప్పింది. అది విన్న కొడుకుల మనసుల్లో పశ్చాత్తాపం మరింత పెరిగింది.

వినోద్‌కు తండ్రి తమతో తరచుగా చెప్పే కొటేషన్ "గుడ్‌నెస్ ఈజ్ ద ఓన్లీ ఇన్‌వెస్ట్‌మెంట్ విచ్ నెవర్ ఫెయిల్స్ టు ఎర్న్ డివిడెండ్స్' గుర్తొచ్చింది.

'నిజం నాన్నా, మీ మంచితనం డివిడెండ్లను సంపాదించడమే కాదు, ఎంతోమంది హృదయాల్ని కూడా గెలుచుకుంది. మాలాంటి పాపాత్ముల హృదయాలు తప్ప' అనుకుని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

విజయ్ తల్లితో "అమ్మా, మమ్మల్ని క్షమించు. నాన్న మంచితనం ఇంత మంది గుర్తించినా, మేము కొడుకులమై ఉండీ గుర్తించలేకపోయాం. గొప్పలకుపోయి ఆర్థిక ఇబ్బందుల్లో పడి, బయటి వ్యక్తులు వచ్చి మన ఇంట్లో జరిగిన మధురమైన దృశ్యాల్ని గుర్తుచేస్తే తప్ప గుర్తుకురాని పరిస్థితిలో ఉండిపోయాం. మనం ఇల్లు అమ్మవద్దు. కింది పోర్షను

రామారావుగారికి అద్దెకిద్దాం. పై పోర్షను మాత్రం ఖాళీగా ఉంచుదాం. నువ్వు మాతో వచ్చేసేయ్. ప్రతి సంవత్సరం వేసవిలో ఇక్కడకు వచ్చి ఓ వారం రోజులు హాయిగా గడుపుదాం. పాత రోజుల్ని గుర్తు చేసుకుని ఆనందిద్దాం" అన్నాడు.

"అవునమ్మా, నిన్ను ఇన్నాళ్ళు నిర్లక్ష్యం చేసినందుకు సిగ్గుపడుతున్నాం. నువ్వు మాతో వచ్చేయ్. ఈ ఇంటి గురించీ, నాన్నగారి మంచితనం, వ్యక్తిత్వం గురించీ మా పిల్లలకు కూడా చెబుదాం. ఈ ఇంటితోపాటు ఆయన పాటించిన విలువలు కూడా వాళ్ళకు వారసత్వంగా లభించనీ" అన్నాడు.

సావిత్రి భర్త ఫొటో వైపు చూసింది.

ఆయన ఆనందంతో నవ్వుతున్నట్లు కనిపించింది ఆమెకు.

'అవును మరి, మానవత్వపు విలువల్ని పిల్లలకు ఆస్తిగా ఇచ్చారు ఆయన. వాళ్ళు వాటిని నిలుపుకుంటే ఆయన ఆత్మ సంతోషిస్తుంది' అనుకుంది తృప్తిగా.

'మిత్రులారా! సమాజంలో ఇలాంటి యథార్థ సంఘటనలు కోకొల్లలు. ఈ రోజు మీరు మంచి హోదాలో ఉండవచ్చుగాక. మీరు ఈ భూమి మీదకు రావటానికి జన్మను ఇచ్చింది ఎవరు? మీరు అనుభవిస్తున్న ప్రస్తుత హోదా మీకు రావటానికి కారణం ఎవరు? కేవలం ఆస్తులు మాత్రమే పంచుకుంటాం. వారి బాగోగులు మాకెందుకు అంటూ జన్మనిచ్చి, కష్టపడి పెంచి పెద్దచేసి ప్రయోజకులను చేసిన కనపడే ఆ దేవుళ్ళను మరిస్తే ఎలా?'

'ఈ రోజు మీ తల్లిదండ్రులను ఎలా చూస్తున్నారో రేపు భవిష్యత్తులో మీ పిల్లలు మిమ్మల్ని అలాగే చూస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ కథ చదివిన తర్వాత అయినాసరే కొంతమంది కొడుకుల మనస్తత్వం అయినా మారుతుందని ఆశిస్తున్నాను'.

"కథ ఓపికగా చదివిన మీకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు".





**శ్రీ కృష్ణావతారం**



# శాశ్వత ధర్మగోప్త

**- రచన : భండారు సదాశివరావుగారు**

**(గత సంచిక తరువాయి)**

## 10. ద్యూతం

దుర్యోధనాదులకు పాండవులు అలా స్వయంశక్తితో ఇంద్రప్రస్థంలో, భరత కులానికి, కురువంశానికి వారసులుగా, సామ్రాట్టులై వెలుగొందడం కంటకప్రాయమైంది. దుష్టచతుష్టయానికి విశ్రాంతి, నిద్ర కరువయ్యాయి. ఎలాగైనా పాండవులను నిర్మూలించాలి. వారిని తుడిచిపెట్టి భరత వంశానికి తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలి! యుద్ధానికి కొందరు కాలు దువ్వారు. కానీ, తామే గతాన్ని స్మరించి ఆ ఊహను వదులుకున్నారు. ద్యూతక్రీడతో పాండవులను ఓడించి వారి ఆస్తులను, రాచరికాన్ని గెలువవచ్చునని శకుని సలహా ఇచ్చాడు. ఆ క్రీడలో తనను ఓడించగలవాడు లేడని కూడా అభయమిచ్చాడు. రాజసూయంలో మయసభను చూచి వచ్చిన దుర్యోధనుడు అసూయతో దాదాపంతటి భవనాన్ని నిర్మింపచేశాడు. దానికి జయంతమని పేరు పెట్టారు. ఆ సభా భవనాన్ని చూడడానికి తండ్రి ద్వారా కబురు పంపించారు. వారిని తీసుకురావడానికి విదురుణ్ణి పంపారు. విదురుడు వెడితే పాండవులు అనుమానించరని దుర్యోధనాదుల విశ్వాసం.

విదురుడు ఇంద్రప్రస్థానికి వెళ్ళాడు. ధృతరాష్ట్రుని ఆహ్వానాన్ని అందవేశాడు. దానితోపాటే కౌరవులు ఏదో దుస్సాహసం చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని, ఏదైనా ఆపద రావచ్చునని కూడా సంకేతించాడు. అయినా ధృతరాష్ట్రుడు కుటుంబంలో పెద్ద కావడాన, తనకు పెద్దతండ్రి కావడాన అతడు పంపిన పిలుపును ఆదేశంగా భావించి మిగతా పాండుపుత్రులు,

ద్రౌపది వద్దన్నా వినక, కుంతి, ద్రౌపది సమేతంగా హస్తినకు వెళ్ళాడు. తాను స్వయంగా కుటుంబ సాంప్రదాయాన్ని, ఎన్ని ఆపదలు వచ్చినా, కాదనలేదు. ధృతరాష్ట్రుని దుష్టత్వానికి అది ఒక సంకేతమే, అక్కడికి వెళ్ళిన తరువాత ద్యూతక్రీడకు రమ్మని దుర్యోధనుడు యుధిష్టిరుని కోరుతూ తన తరపున శకుని క్రీడలో పాల్గొంటాడని ప్రకటించాడు.

అధర్మ పరంపర ప్రారంభమైంది అక్కడే. అది కేవలం సుహృత్ క్రీడ అయితే ఎవరైనా ఆడవచ్చు. గెలుపు ఓటముల ప్రశ్న ఉండదు. న్యూనతా భావం ఎవరికీ కలుగదు.

ఆది దాయాదుల మధ్య విషయం కనుక శకునికి ప్రమేయం లేదు. అతనితో ఆడడానికి యుధిష్టిరుడు నిరాకరించనూవచ్చు. ఆనాడు ద్యూతం కూడా ఒక యుద్ధంగానే, రెండు బలాల మధ్య స్పర్ధగానే భావింపబడేది. యుద్ధభూమిలో సమఉజ్జీలే ఒకరిని ఒకరు ఎదురుకుంటారు. శకుని యుధిష్టిరుని ఎదుర్కోవాలనే కోరికే ఉంటే తన దేశమైన గాంధారానికి పిలివాలి. యుధిష్ఠిరుడు రానంటే, అప్పుడు, తాను యుధిష్ఠిరునిపై యుద్ధాన్ని ప్రకటించవచ్చు.

రక్తపాతానికి దారితీసే యుద్ధాన్ని నివారించడానికి వ్యక్తిగతమైన అహంకార తృప్తికి, క్రోధాధులను, శత్రుత్వాన్ని తృప్తిపరచుకోవడానికి, ద్యూత క్రీడ ఒక మార్గంగా భావింపబడిన కాలమది.

శత్రుత్వమనేది ఉభయతోభావం. పాండవులకు ధృతరాష్ట్రునితో అతని సంతానముతోను శత్రుత్వం లేదు. కనుక ఉభయులకు ఎలాంటి శత్రుత్వం లేదు. కనుక ఉభయవర్గాలు దాయాదులు కనుకను, భరతవంశపు తొలి కుదుటికి ప్రతినిధిగా ప్రస్తుతం హస్తినలో ఉంటున్నది ధృతరాష్ట్రుడు కనుకను, ఇంద్రప్రస్థ చక్రవర్తి అయిన యుధిష్టిరునితో రక్తపాతకారకమైన యుద్ధంలో కాకుండా ద్యూతంలో తమతమ పగలు సాధించుకోవచ్చునని శకుని సలహా.





యుద్ధం ఎప్పడు త్యాజ్యమే. దానివల్ల రక్తపాతం జరుగుతుంది. ఉభయపక్షాలలోని ఆత్మీయులు మరణిస్తారు. అందరికి ఆ శత్రుత్వం ఉండకపోవచ్చు.


కాని శకునికి మాత్రం అందులో పాల్గొనే అవకాశంగానీ, అవసరం గానీ లేనేలేదు. శకుని పాండవులకు దాయాది కాదు. ఉభయులకు ఎలాంటి శత్రుత్వం లేదు. కనుక ద్యూతంలో పాల్గొనే సందర్భమే రాదు. కాని ధృతరాష్ట్రుని గుడ్డితనం అతనికి ఒక ప్రబలమైన ఆయుధం. అతని దీనాలాపాలకు కరిగి భీష్మాదులు ద్యూతంలో పాల్గొనకుండా శకునిని నివారించలేకపోయినారు. అలా ద్యూతం వ్యసనం అని, అనార్యజుష్టమని తెలిసీ, హస్తినకు అంకితమై ఉన్నామనే భ్రమతో కురువృద్ధులు, ఆ సభలోని పెద్దలు నోరు ఎత్తక ఆ మహాపాపాన్ని సాగనిచ్చారు. అప్పడే వారు తమ వ్యక్తిత్వస్థాయి నుంచి దిగజారారు. ఆతతాయి దుర్యోధనుని పాపాన్ని మౌనంతో సమర్థించారు.

యుధిష్ఠిరునికి ద్యూతంలో నైపుణ్యం లేదు. చేతివాటంతో తప్పడు ఆటను ఆడడం ఎరుగనివాడు. కాని, శకునికి అలాంటి నిషేధాలు లేవు. ఇది యుధిష్ఠిరునికి తెలుసు, అయినా యుద్ధాన్ని, రక్తపాతాన్ని ఇష్టపడని యుధిష్ఠిరుడు నెత్తుటికూటిని భుజించడం కంటే, ఏ మార్గమైనా స్వాగతింప తగ్గదే అని భావించాడు.

పావులు కదిలాయి. అనుకున్నట్లే శకుని ప్రతీ ఎత్తుని గెలిచాడు. యుధిష్ఠిరుడు తన స్థిరచరాస్తులను పణం పెట్టి ఓడాడు. చివరకు తనను తాను కూడా పందెమొడ్డి ఓడాడు.

ఆ తర్వాత ఆ పాపపు ప్రక్రియలో మలిభాగం ప్రారంభమైంది. యుధిష్ఠిరుణ్ణి రెచ్చగొట్టి ద్రౌపదిని పణం ఒడ్డమని శకుని ప్రేరేపించాడు. ఆమె పాండవ పట్టమహిషి కాదు అని హేళన చేశారు. భార్య భర్త సొత్తు గనుక పందెమొడ్డవచ్చునన్నాడు.

**(సశేషం)**



# సాయిభక్త దాసగణు

రచన : విజయ కిషోర్

(గత సంచిక తరువాయి)

(భావం : జగత్తులోని సర్వ పదార్థాలను నేను చూడకుండానే చూసాను. కారణం నా యొక్క "నేను" అంతరించడం వలన నేను దేహానికి మాత్రమే పరిమితం కాకుండా సర్వ జగత్తులో వ్యాపించాను. అందువలన నేను చేతితో తీసుకోనిది ఆత్మస్వరూపంతో తీసుకొన్నాను. నేను పాదాలతో ఎక్కడకు వెళ్ళలేదో అక్కడకు ఆత్మస్వరూపంతో వెళ్ళాను. నోటితో తినకుండా అన్నింటిని తిన్నాను. నాలుక ఏ రసాన్ని అయితే రుచి చూడలేదో ఆ రసాన్ని సేవించాను. ఎవరితో కూడా మాట్లాడకుండానే అందరితో కూడా, అన్నివేళలలో మాట్లాడాను. ఇతరుల దృష్టిలో ఏదయితే దాచబడి ఉందో, దానిని నేను ఆత్మదృష్టితో తెరిచాను. తుకారాం అంటున్నాడు "చెవులతో ఏదయితే వినలేదో" అదంతా విన్నాను. నేను ఇప్పుడు అన్నింటితో అభేదుడనై పోయాను.)

వాస్తవానికి దాసగణు కొంచెం బాబాను నిశితంగా గమనించి నట్లయితే, తక్త్యైన భుంజిథాః (త్యాగం చేసి అనుభవించు) అనే వాక్యానికి సజీవసాక్ష్యంగా శ్రీ సాయి భాసిస్తారు. ఇహంలో బాబాను చూసినట్లయితే అత్యంత సాధారణమైన జీవనం. కుక్కలు, పిల్లులు తినగా మిగిలిన భిక్షాన్న భోజనం, గోతం పట్టాంపై శయనం, ఇటుకరాయి తలగడ, చౌకబారు ముతక వస్త్రంతో కుట్టిన కఫ్నీ పరిధానం, గతుకుల గుంతల మట్టినేల కలిగియున్న పాడుబడిన మసీదులో నివాసం! మనం ముందర చెప్పకున్న విధంగా వర్షం వస్తే, మసీదు మట్టినేలంతా తడిసిపోయి, ఆ నేలలోని గుంతలలో నీరు నిలిచిపోయేది. అయినా సరే, బాబా అక్కడే నిద్రించే వారు. అటువంటి ఒకానొక సందర్భంలో, వర్షం విపరీతంగా కురుస్తూ, మసీదులో నీరు నిలిచిపోయి, కాలు పెట్టడానికి కూడా వీలులేని





పరిస్థితుల్లో నారాయణ తేలి మరియు ఇంకొందరు సన్నిహిత భక్తులు బలవంతంగా బాబాను భుజాలపై మోసుకువచ్చి, ఆ రాత్రి చావడిలో పడుకునేటట్లు చేశారు. అప్పటినుండి బాబా చావడిలో రోజు మార్చి రోజు పడుకోవడం మొదలుపెట్టారు. వాస్తవానికి చావడిలో కూడా పరిస్థితులు భయానకంగానే ఉండేవి. కాకపోతే మసీదు కంటే కొంచెం మెరుగ్గా ఉండేవి.

అటువంటి వర్షంలోకానీ, లేదా గడ్డకట్టించే చలిలోగానీ బాబా ఒంటిపై ఒక లంగోట మరియు కఫ్నీ మినహా మిగిలిన ఏ ఆచ్ఛాదన ఉండేది కాదు. చలి నుండి రక్షణగా ఆయన ఎన్నడూ ఎటువంటి వస్త్రాన్ని ధరించేవారు కారు. అందుకనే ఆయన ఒంటిలో కఫం బాగా పేరుకునేది. అందువలన బాబా కంగుకంగున దగ్గేవారు. ఏ క్షణంలోనయినా ప్రాణం పోతుందేమోనన్నట్లుగా బాబా దగ్గుతుండేవారని ఆనాటి భక్తులు వారి స్మృతులలో చెపుతారు. బాబా దగ్గేటప్పడు నోట్లో నుండి దోసిళ్ళు, దోసిలు కఫం బయటకు వచ్చేది. ఆ కఫం వలన ఆయన ఉబ్బసంతో బాధపడేవారు.

ఇక వేసవికాలం విషయానికి వస్తే, మసీదు బయట ప్రాంగణంలో ఎటువంటి పైకప్పు లేకపోవడం వలన, మసీదులోకి ఎండ చొచ్చుకొని వచ్చేది. అందువలన మసీదులో బాగా వేడిగా ఉండేది. అటువంటి ఎండ సెగలో కూడా బాబా ధుని ముందు కూర్చొనే ఉండేవారు. ఇక చెప్పేదేముంది, ఒక ప్రక్క ఎండ సెగ, ఇంకొక ప్రక్క ధుని వేడి! ఒక విధంగా నిప్పుల కుంపటిలో ఉన్నట్లుగా ఉండేది. అయినాసరే, బాబా చలించేవారు కారు. చల్లదనం కోసం ప్రయత్నించేవారు కారు.

తరువాతి రోజులలో (1910 తరువాత, అంటే చివరి ఎనిమిది సంవత్సరాలు) ఆయన చుట్టూ ఎంతో వైభవం చోటు చేసుకున్నా, ఆయన ఫకీరు జీవన విధానంలో ఏ మార్పూ లేదు. ఆ వైభవం పట్ల ఆయన ఎంతో అలిప్తంగా ఉన్నారు. నిఖార్సయిన నిర్మోహత్వానికి ప్రతీకగా నిలిచారు. అవధులు లేని ఆనంద స్వరూపుడై నడయాడారు. ఎవరో

భక్తురాలు పంపించిన బంగారు నాణేలను మహల్సాపతి బాబాకు చూపితే, తమ హృదయం వైపుకు చేయి చూపిస్తూ "అరే, భగత్ అది బంగారమా, ఇది బంగారమా" అని తన నిజస్థితిని ఉద్దేశించి అన్నారు. తద్వారా ఎంతకీ కరగని, ఎన్నటికీ తరగని బంగారమేమిటో తేల్చి చెప్పారు.

ఎక్కడో ఒక భక్తురాలు ఆకలిగొన్న కుక్కకు రొట్టెముక్క వేస్తే, ఇక్కడ బాబా మసీదులో కూర్చొని త్రేన్పారు. ముంబాయిలో భక్తులు పొగడపూలతో పూజ చేస్తే "ఆ పొగడపూల వాసనకు నాకు రాత్రంతా నిద్ర పట్టలేదు" అని వ్యాఖ్యానించారు. అంటే, వస్తువు తమ వద్ద లేకపోయినా, ఆ వస్తువు తాలూకు సుఖాన్ని (ఆనందాన్ని) ఉపభోగించారు. ఒకప్రక్క ఎంతో నిర్మోహత్వంతో, నిరీచ్ఛతో, నిరహంకారంతో తరగని ఆనందంతో, అన్నింటిని త్యజించి జీవన పర్యంతం నడయాడారు. "తక్త్యేన భుంజీథాః" అనే వాక్యానికి ఇంతకంటే సరయిన సజీవమైన తార్కాణం ఎక్కడ దొరుకుతుంది?

వాస్తవానికి ఆ శ్లోకంలోని ప్రతి అక్షరం శ్రీ సాయి వంటి సద్గురు మూర్తిని ఆధారం చేసుకునే ప్రభవించినట్లుగా, ఆయన నిజస్థితిని ప్రతిధ్వనింపజేస్తున్నట్లుగా, ఆయన ఆదర్శ జీవన విధానాన్ని ప్రతిబింబిస్తున్నట్లుగా మనకు స్పష్టంగా గోచరమవుతుంది.

**ఈశావాస్య మిదం సర్వం .... (ఈ సర్వమంతా ఈశ్వరుడే ఆవరించి యున్నాడు.) ....**

నానాసాహెబ్ చందోర్కర్ ఒకసారి హరిశ్చంద్ర పర్వతాన్ని మండు టెండలో అధిరోహించసాగారు. సగం దారిలో దాహంతో నాలుక పిడచ కట్టుకు పోయి అడుగుముందుకు పడలేని స్థితిలో "బాబా, నేను కూర్చొన్న చోటనే, నాకు మంచినీరు కావాలి" అని ప్రార్థించారు. అప్పుడు ఒక భిల్లుడు (అడవిజాతికి చెందినవాడు) నానాసాహెబ్ వద్దకు వచ్చి, మీరు కూర్చొన్న బండ క్రిందనే నీళ్ళు ఉన్నాయి" అని చెప్పి వెళ్ళిపోయాడు. అప్పుడు నానా సాహెబ్ లేచి, ఆ బండను తొలగించి చూస్తే స్వచ్ఛమైన నీటి చెలమ అక్కడ ఉంది.

**(సశేషం)**





# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము

## భక్తి పద్య కావ్యము



రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**

**(గత సంచిక తరువాయి)**

ఆ.వె. తను పరీక్ష నెగ్గ "దర్శించి సాయిని
పంచిబెడుదు మిశ్రి భక్తజనుల"
చక్కెరతడు మాని చప్పని టీత్రాగె
ధనము కూడబెట్ట దారిఖర్చు 7

కం. కదలక మెదలక నుండియు
నుదరము నుండెడు జగముల నొల్లక నెటులుం
డదగున్ సాయికి దెలియని
దదియేది గలదు జగముల దాగిన నెందున్ 8

ఆ.వె. శ్రద్ధ జూపి నెవరు సాయిబాబ నెదుట
చేయిజాపు నతని జేరదీసి
విడక నుండు నతని వెంట నెపుడు, భక్తి
గొలుచు నార్తు నాదుకొనుచు నుండు 9

ఆ.వె. బల్లుల చికచికలు - భక్తుని మదిలోని
సందియమును దీర్చె సాయిబాబ
చెల్లి రాక దెలిసి చెందెను సంతోష
మనుచు దెలిపె సాయి మర్మమంత 10

తే.గీ. వచ్చె శిరిడీకి నౌరంగ బాదు వాసి
సంచి విదిలించ నొకబల్లి సంచి నుంచి
గోడ ప్రాకుచు తనయక్క కడకు జేరి
ముద్దు ముచ్చట లాడుచు మురిసిపోయె 11

తే.గీ. లోక లోకాలు తనయాత్మ లోన నుండు
ఆత్మలన్నియు తనదైన యాత్మ యగుచు
కదల కుండనె సర్వము గాంచుచుండు
సాయి సర్వేష పరమాత్ము సన్నుతింతు 12

## 22. సాయి సగుణ బ్రహ్మ

ఆ.వె. భక్తి ప్రియము తోడ బహుకరించగ నీవు
స్వీకరించు సాయి చిన్ని దైన
అహము తోడ నీయ యంగీకరించడు
యెంత వారిదైన యెంతదైన 1

ఆ.వె. ఆదరమున నీయ అంది పుచ్చుకొనును
వినయమునకు గొప్ప విలువ నిచ్చు
బాహ్య విషయ చింత పట్టించు కొనరాడు
ఆత్మ లోన సాయి యమరియుండు 2

ఆ.వె. కల్ప వృక్షమైన కామధేనువునైన
సాయికి సరిబోల్ప సమము గావు
దైవమెుండు లేడు దాక్షిణ్య భావాన
తీర్చ గలుగ కోర్కె తీరు సాయి. 3

ఆ.వె. మేలుగోరు సాయి మేటిని భక్తుల
దయను జూపి జేర్చు దరికిజేర
యూహ కంద డతడు యూర్మిన పరమేశు
భక్త జనుల నిధియు బాబసాయి 4

ఆ.వె. సాయి కీర్తి వినుచు సత్వరమున బ్రహ్మ
బడయు కొఱకు ధనము బలసి నతడు
యివ్వమనుచు వచ్చె యీప్సిత జ్ఞానాన్ని
చాల దవ్వు నుంచి సాయి కడకు 5

(సశేషం)





# గురువాణి

భూమండలంలో ఉన్న దేశాలన్నిటికన్నా పరమపవిత్రమైన దేశం భరత భూమి. ఇది ఎంత భాగ్యానికి నోచుకున్నదంటే-స్వయంగా పరమాత్ముడి యీ గడ్డ మీద ఎన్నోమార్లు అవతరించి సద్ధర్మమార్గాన్ని మానవాళికి ఉపదేశించారు. అంతేకాక-తనకు ప్రతినిధులుగా, తన అంశాలతో అనేక మంది మహర్షులను కూడా ఈ దేశానికి ప్రసాదించారు. వారి ద్వారా ధర్మం మళ్లీ మళ్లీ జనావళికి అందేలాగా చేసారు. అందుచేతనే యీ నేల పునీతమైపోయింది.

అసలు జీవరాసులన్నింటిలోనూ మానవజన్మ శ్రేష్ఠమైనది. ఎందుకంటే మానవుడొక్కడికే వివేకం అంటూ ఉన్నది. సక్రమంగా ఆలోచించ గలగటం, సరైన మార్గంలో నడవటం, క్రమక్రమంగా దైవత్వం వైపు అడుగువెయ్యటం-యివన్నీ మానవజన్మ ఎత్తిన వాడికే సాధ్యం. ఈ లోకంలో సుఖశాంతులతో బ్రతకడానికీ, సాటి వారికి కూడా అలా జీవించే అవకాశం కల్పిస్తూ పరమాత్మను చేరుకోవడానికీ ఆ తండ్రి స్వయంగా చూపించిన మార్గమే ధర్మం. ఇది హిందూదేశంలోనే ఆవిష్కరింపబడింది గనుక దీనిని హిందూధర్మం అన్నారు. ఈ ధర్మానికి యీ దేశంలో పుట్టిన ప్రతి మనిషీ వారసుడే. అంతేకాదు-ఇక్కడ పుట్టిన ప్రతివారూ ధర్మం ఆచరించాలి. ఇతరుల చేత ఆచరింపజేయాలి. ఇది మన కర్తవ్యం-మన భాగ్యం కూడా.

హిందూ ధర్మం మనుష్యులందరినీ-మనుష్యులనేమిటి సర్వజీవులనూ ప్రేమిస్తుంది-ఏ జీవినీ ద్వేషించదు. ప్రపంచంలో కొన్ని మతాలలాగా కొద్ది పరిమిత సూత్రాలనే చెప్పి, “ఇది ఒక్కటే మార్గం-ఈ మార్గానికి రానివారు ఎంత పుణ్యాత్ములైనా సరే, ధర్మాత్ములైనాసరే నరకానికే పోతారు” అనదు.

తన మాట వినని వారిపట్ల ద్వేషం నూరిపోయదు. మరికొన్ని మతాల లాగా “మేము చెప్పిన త్రోవలోకి రాని వారికి బ్రతికే హక్కే లేదు” అంటూ

క్రూరత్వాన్ని బోధించదు. ఈ హిందూ ధర్మం ప్రేమ సిద్ధాంతం బోధిస్తుంది. "సర్వేజనా సుఖినోభవంతు", "లోకాస్సమస్తాస్సుఖినోభవంతు" అంటూ సర్వజీవుల క్షేమాన్నీ కోరుతుంది. లోకశాంతికి మూలాధారమైనది యీ హిందూ ధర్మం. వేదాలు, గోమాత, భరతమాత, అవతార పరంపర-వీటన్నింటినీ హిందూ ధర్మం గౌరవిస్తుంది. ప్రేమిస్తుంది, హిందువైనవాడు ఇలాగే ఉండాలి.

ప్రపంచంలోని ఇతర దేశాలు బట్టకట్టటం కూడా చేతగానంత అనాగరికతలో ఉన్న కాలంలోనే మన పుణ్యభూమిలో అనేక రకాల శాస్త్ర జ్ఞానం విస్తరిల్లింది. గ్రహగతులను కనుగొన్న వరాహమిహిరుడు, ఆర్యభట్టు (ఖగోళ శాస్త్రం) విమానతంత్రం రచించిన భరద్వాజుడు, గణిత గ్రంథాలు రచించిన భాస్కరాచార్యుడు (గణితశాస్త్రం) శల్యచికిత్స, శస్త్రచికిత్సలు చేసిన శుశ్రుతుడు (సర్జరీ), అనేకానేక వ్యాధులకు చికిత్స చేసిన చరకుడు (వైద్యశాస్త్రం), రసాయనాలతో ఎన్నెన్నో ప్రయోగాలు చేసిన నాగార్జునాచార్యుడు (రసాయన శాస్త్రం), రామసేతువు నిర్మించిన నలుడు, నీలుడు (టెక్నాలజీ-ఇంజనీరింగ్)- వీరంతా హిందూ దేశపు రత్నాలే. ఇలాంటి అత్యంత శ్రేష్ఠమైన జాతిలో పుట్టటం మన జన్మజన్మల భాగ్యం. దీన్ని మనం నిలుపుకోవాలి.

"మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథి దేవోభవ" అంటుంది హిందూ ధర్మం. తల్లిదండ్రులతోపాటు గురువునూ, అతిథినీ కూడా దైవంతో సమానంగా గౌరవించాలి. "ఆత్మ వత్సర్వభూతాని"- సర్వజీవులూ నీవంటివే. నిన్ను నీవెలా ప్రేమించుకుంటావో అన్ని జీవులనూ అలాగే ప్రేమించు-అన్నది మన ధర్మం. ప్రేమమూర్తివై పదుగురికీ సేవ చేయి. నీ సత్ప్రవర్తన ద్వారా ఇతరులకు ఆదర్శంగా నిలువు. మానవత్వం నుండీ దివ్యత్వం వైపు ఒక్కొక్క అడుగూ వేస్తూ నడువు"-ఇవీ హిందూ మతం బోధించే సూత్రాలు. ఇలా నడిచే ప్రతివాడూ దేవుని సంతానమే. హిందూ ధర్మ గ్రంథాలు అధ్యయనం చేసిన విదేశీయులెందరో అభిమానంతో యీ ధర్మాన్ని ఆచరించి మేలు పొందారు-పొందుతున్నారు





కూడా. ఇతర మతాలలో ఉన్న కొద్దోగొప్పో మంచి విషయాలన్నిటికీ మూలం హిందూ ధర్మమే. ఇందులోనుండి తీసుకున్నవే అవన్నీ. ఈ హిందూధర్మం లోని ప్రతి ఆచారమూ సైన్స్‌తో ముడిపడి ఆరోగ్యవర్థకమైనదే.

ఇటువంటి సర్వశ్రేష్ఠమైన హిందూ ధర్మానికి వారసుడివైనందుకు గర్వించు. ఎట్టి ప్రలోభాలకూ లొంగక, ధర్మభ్రష్టుడివి కాక అణువణువునా హిందువై జీవించు. మనిషివై పుట్టినందుకు- అందునా హిందువై ఉన్నందుకు ధన్యుడివై తరించు. మోక్షాన్ని సంపాదించు.

# మాతృసంస్థ కబుర్లు

## శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం ఆశ్రమం- సాయిధామ ఆశ్రమ శాఖ - సత్తెనపల్లి

శ్రీ కోదండ రామసాయి సన్నిధానం ఆశ్రమంలో అక్టోబరు 15వ తేదీ నుండి శరన్నవ రాత్రి కార్యక్రమాలు వైభవోపేతంగా జరిగినవి. తొమ్మిది రోజులు అమ్మ వారికి తొమ్మిది అలంకారములు చేసి ప్రతిరోజు అమ్మ వారికి కుంకుమార్చనలు జరిగినవి.

మొదటి రోజు బాలా త్రిపుర సుందరీదేవిగా, రెండవ రోజు గాయత్రీ దేవిగా, మూడవ రోజు అన్నపూర్ణాదేవిగా శాకాంబరి అలంకారములో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలతో చేసి ఈ అలంకారము భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నది. నాల్గవరోజు మహాలక్ష్మీదేవిగా, ఐదవ రోజు మహాచండీదేవిగా, 6వ రోజు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆశ్రమ పరిసరాలలో ఉన్న చదువుకునే బాలబాలికలు చదువుల తల్లి సరస్వతీదేవికి కుంకుమార్చన చేసారు. పూజారిగారు శాస్త్రోక్తంగా వారి చేత అమ్మ వారికి పూజ చేయించారు. పూజలో పాల్గొన్న పిల్లలందరికీ అమ్మ వారి ప్రసాదంగా పుస్తకము, పెన్ను ఇవ్వబడినది. 7వ రోజు లలితా త్రిపురసుందరిదేవిగా గాజుల అలంకారములో భక్తులకు దర్శనమిచ్చారు. 8వ రోజు దుర్గాదేవిగా, 9వ రోజు మహిషాసుర మర్దిని దేవిగా ఉగ్రరూప

అలంకారముతో దర్శనమిచ్చారు. అదేరోజు సాయంత్రం రాజరాజేశ్వరి దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. తొమ్మిదిరోజులు రాత్రి గం.7.00ల నుండి బతుకమ్మ ఆటలు, పూజా కార్యక్రమాలు వైభవంగా, కోలాహలంగా జరిగినవి, ఆశ్రమ పరిసరాలలో ఉన్న భక్తులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ పూజలు చేసారు.

24వ తేదీ రాత్రి గం.7.00లకు ఆశ్రమంలో ఆనంద సాయి ప్రభు మందిరంలో బాబా వారి సమాధి ఉత్సవం వైభవోపేతంగా జరిగినది. వివిధ రకాల పూలతో పూలమాలలతో సమాధిని అలంకరించాము. సాయంత్రం గం.4.00ల నుండి బాబా సచ్చరిత్ర పారాయణ జరిగినది. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పారాయణ చేసారు. రాత్రి గం.7.30 ని.లకు వచ్చిన భక్తులందరూ బాబా సమాధి చుట్టూ దీపాలు వెలిగించారు.

తన సమాధి నుండి బాబా సర్వకార్యాలు నిర్వహిస్తానని, భక్తులను రక్షిస్తానని బాబా చెప్పిన మాటలను సచ్చరిత్ర నుండి ఈ అంశాన్ని పూజారి గారు భక్తులకు వివరించి చెప్పారు. అనంతరం వచ్చిన భక్తులందరు బాబా వారి పాదాలకు సమాధి చుట్టూ తిరుగుతూ నృత్యం చేయడం ఎంతో కన్నులపండువగా ఉన్నది. నూతన వస్త్రధారణతో పూలమాలాలంకృతులై, కిరీటధారులైన ఆనందసాయి ప్రభు వారు దివ్యతేజస్సుతో భక్తులకు దర్శన మిచ్చారు. అనంతరం బాబా సమాధి వద్ద పూజా కార్యక్రమం జరిగినది. ప్రసాద వితరణతో కార్యక్రమం ఆనందోత్సాహాలతో ముగిసినది.

26వ తేదీ సాయంత్రం అమ్మవారి తెప్పోత్సవం మరియు పూజల బతుకమ్మ ఆటలు, పూజా కార్యక్రమాలు వైభవోపేతంగా జరిగినవి. తొమ్మిది రోజులు అమ్మవారు భక్తుల పూజలందుకొని ప్రసన్నవదనంతో బతుకమ్మ పూల బతుకమ్మల తోడుగా భక్తుల కోలాహలంగా తెప్పోత్సవానికి తరలి వెళ్ళారు. సమీపంలో ఉన్నటువంటి చెరువులో అమ్మవారి తెప్పోత్సవం ఎటు వంటి ఆటంకం లేకుండా నిర్విఘ్నంగా జరిగినది. ఈ కార్యక్రమానికి అమ్మ వారి విగ్రహాన్ని సమర్పించిన శ్రీ మామిడి సంగమేశ్వరరావు, దివ్యవాణి దంపతులు మరియు ఈ కార్యక్రమానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా





సహకరించిన భక్తులందరికీ అమ్మవారి సంపూర్ణఆశీస్సులు. పరమపూజ్య గురుదేవులు, పూజ్య మాతాజీగార్ల ఆశీస్సులు లభించాలని ప్రార్థనచేస్తున్నాం.

## శ్రీ సాయినాథ క్షేత్రం - మైనేనివారి పాలెం

శ్రీ సాయినాథ క్షేత్రంలో అక్టోబర్ 24న సాయిబాబా వారి సమాధోత్సవం అత్యంత కన్నులపండువగా జరిగింది. సాయినాథుల వారికి క్షీర, జల, పంచామృతాభిషేకాలతో ఆలయపూజారిగారు గ్రామ ప్రజల చేత అభిషేక మహోత్సవాన్ని నిర్వహించి, అనంతరం అష్టోత్తర పూజ చేయించారు. శ్రీసాయినాథ క్షేత్రం-మైనేనివారి పాలెం పరిసర గ్రామమైన పోటుమెరక (ఆశ్రమం నుండి 8 కిలోమీటర్లు) గ్రామం నుండి సుమారుగా 150 మంది భక్తులు బాబా వారి పల్లకీ ఊరేగింపుతో, సాయినామ సంకీర్తనతో, పాదయాత్రతో సాయినాథ క్షేత్రం చేరుకొని బాబా వారి సమాధి ఉత్సవాన్ని సందర్శించారు. గ్రామ ప్రజలు, పరిసర గ్రామాల ప్రజలతో ఆశ్రమం అంతా భక్తులతో కిటకిటలాడింది. బాబా సమాధికి పూజ్య గురుదేవుల శిష్యులైన ఎల్లాప్రగడ భాస్కరప్రసాద్ శర్మగారు సాయి నాథుల వారికి అష్టోత్తర పూజ కావించి బాబా సమాధి ఘట్టాన్ని భక్తులకు సవివరంగా వివరించారు. బాబా వారి సమాధి ఘట్టాన్ని భక్తులు మైమరచి ఆలకించడం జరిగింది. కృష్ణానది ఒడ్డున సాయినాధులవారు కొలువుండటం స్వామి ప్రసన్నరూపం, ఆ తేజస్సును చూసి భక్తులు ఆనందంతో ఇలాంటి సుందరమైన భవ్యమందిరాన్ని పూజ్యగురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ మహారాజువారు నిర్మాణం చేసి మా గ్రామాలకు ఒక వెలుగునిచ్చారని పూజ్య గురుదేవులను, అమ్మ మాతాజీ గార్లను కొనియాడారు. మధ్యాహ్నహారతి అనంతరం అన్నప్రసాదాన్ని అందరికీ అందించడం జరిగింది. (సుమారుగా 800 మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు). ఈ కార్యక్రమంలో శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు సభ్యులైన శ్రీ బూర్లగడ్డ గోపీకృష్ణగారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన గ్రామ ప్రజలందరికీ, బాబా వారి సంపూర్ణ ఆశీస్సులు లభించాలని మనసారా ప్రార్థన చేస్తుంది సచ్చిదానంద సద్గురు సాయివాణి.

శ్రీ సాయిరాం

## షష్ఠ వార్షిక అష్టోత్తర శత కుండాత్మక ఏకాహ్నిక

# శ్రీ దత్త మహాయాగము

**సాయిధామం, పెద్ద పర్వతాపురం గ్రామం, యాదాద్రి భువనగిరి జిల్లా**

**తేది : 26,12,2023. మంగళవారం వేదిక : సాయిధామం**

శ్రీ సాయినాథుడు ఒక విశిష్ట యోగీశ్వరుని రూపంలో కనిపించిన సంపూర్ణ దత్తావతారం. పరులను సేవించడంలోనే ముక్తిమార్గం ఉన్నదని ఆయన వాచా కర్మణా కూడా చెప్పారు. సమస్త జీవరాశులలోను నన్నే చూడండి అని ఆయన మనకు హితవు చెప్పారు. స్వయంగా తామే ఆబాల గోపాలాన్ని సేవిస్తూ గడిపారు. ఆయన భక్తులకు ఎవరికైనా ఆ విధానమే శిరోధార్యం. ఆ మార్గంలో ప్రయాణించిన శ్రీ సాయి దత్త పీఠాధిపతులు, సాయిా ప్రసన్నులు, శ్రీ సాయిా సేవా సమితి ట్రస్ట్, సాయిధామం, శ్రీ సాయినాథ క్షేత్రం, శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం సేవాశ్రమాల వ్యవస్థాపకులు పరమపూజ్య గురుదేవులు **శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ మహరాజు** వారు. వారి దివ్య ఆశీస్సులతో, **శ్రీ మాతా శుకవాణీ** గారి కృపాశీస్సులతో .... **శ్రీ సాయిదత్త పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీ** వారి ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ త్రిగుళ్ళ మాధవశర్మ గారి మిత్రబృంద పర్యవేక్షణలో లోక కళ్యాణార్థం భక్తాభీష్ట సిద్ధ్యర్థం నవగ్రహ దోష నివారణార్థం విజయ అభయ ఆయురారోగ్య ఫల సిద్ధ్యర్థం త్రిమూర్త్యాత్మక స్వరూపుడైన శ్రీ దత్తాత్రేయ స్వామి అవతరించిన రోజున దత్త జయంతి స్వస్తిశ్రీ శోభకృత్ నామ సంవత్సర మార్గశిర శుద్ధ పౌర్ణమి (దత్త జయంతి) **మంగళవారం తేది : 26-12-2023**న మన సాయిధామంలో ఏకాహ్నిక దీక్షా విధానంతో అష్టోత్తర శత కుండాత్మక శ్రీ దత్త మహాయాగము జరుపుటకు సంకల్పించబడినది. కావున భక్తులందరూ ఈ శ్రీ దత్త మహాయాగములో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరు.





## కార్యక్రమ వివరములు

**26-12-2023 మంగళవారం**

ఉ.గం. 8.00ల నుండి శ్రీ విఘ్నేశ్వర పూజ, స్వస్తి వాచనము, అఖండ దీప స్థాపనము, శ్రీ గురు పూజ, గోపూజ.

ఉ.గం. 9.00 : శ్రీ దత్తాత్రేయ స్వామి వారికి పంచామృత అభిషేకము, పూజ

ఉ.గం.10.00 : యాగశాలా ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, శ్రీ గణపతి హోమము, నవగ్రహ హోమము, శ్రీ దత్తాత్రేయ మూల మంత్ర గాయత్రీ హోమములు.

దత్త హోమం విశిష్టత గురించి

**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీ వారి ప్రవచనం**

మ.గం.1.00 : **శ్రీశ్రీశ్రీ మాతా నిర్మలయోగి భారతి** గారి అనుగ్రహ భాషణం తదనంతరం పూర్ణాహుతి

మ.గం.2.00 : అన్నప్రసాద వినిమయం

ఈ యజ్ఞం కార్యక్రమంలో పాల్గొనే భక్తులు దక్షిణగా రూ.1,116/-లు సమర్పించవలసి ఉంటుంది. ఈ యజ్ఞ సామగ్రి ఆశ్రమమే అందజేస్తుంది. ఎవ్వరైనను యజ్ఞంలో పాల్గొనవచ్చును. యజ్ఞంలో పాల్గొనేవారు సాంప్రదాయ దుస్తులనే ధరించాలి. ఈ యజ్ఞం కార్యక్రమమునకు భక్తులు అధిక సంఖ్యలో మరియు సకాలమునకు విచ్చేయగలరు. యజ్ఞంలో పాల్గొనలేని వారు వారి పేరు, గోత్ర నామములను తెలియజేసిన యెడల వారి పేరిట కూడ యజ్ఞం నిర్వహించబడుతుంది. ఈ యజ్ఞ కార్యక్రమమునకు ధన, వస్తు రూపేణ సమర్పించి శ్రీ సాయిదత్త ప్రభు వారి కృపకు పాత్రులగుదురు గాక.

**వైదిక నిర్వహణ : బ్రహ్మశ్రీ త్రిగుళ్ళ మాధవశర్మ**

## అందరికీ ఇదే ఆహ్వానము

**ఇట్లు**

**సాయిధామం**

**వివరాలకు సంప్రదించండి : సెల్ నెం. 9440413455, 9848133565**